క్లుప్తంగా

విజయపురిసౌత్ ఎస్ఐగా అశోక్ కుమార్



విజయపురిసౌత్: విజయపురిసౌత్ ఎస్ఐగా డి.అశోక్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వచ్చారు. ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతానని హెచ్చరించారు.

పట్టాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాచర్ల: పట్టణాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పురపాలక సంఘ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. సమస్యలు ఉంటేనే నేరుగా చాంబర్‌లో కలిసి తన దృష్టికి తీసుకురావాలన్నారు. 31 వార్డుల్లో మంచినీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, మురుగు లాంటి సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. శనివారం ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



గురజాల రూరల్: రేషన్ సరుకులు ప్రతి నెలా విధిగా కార్డుదారులకు అందించేలా చూడాలని తహసీల్దార్ కుటుంబరావు అన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలు, రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే నిత్యావసరాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. కార్డుదారులకు సరుకులు సక్రమంగా అందించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని కోరారు.

బార్ అసోసియేషన్ హాల్‌లో ఐఏఎల్ వాల్ క్లాక్ ఆవిష్కరణ



సత్తెనపల్లి: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కమిటీ సత్తెనపల్లి బార్ అసోసియేషన్‌కు బహూకరించిన 'వాల్ క్లాక్'ను సత్తెనపల్లి బార్ అసోసియేషన్ హాల్‌లో సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.వి జయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, మొదటి అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఇందిరా ప్రియదర్శిని, రెండవ అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) జె.సుజన్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్ కుమార్, ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సత్తెనపల్లి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నరిశేటి వేణుగోపాల్, పలువురు సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

భవిత సెంటరు సేవలు ఉపయోగించుకోండి

ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం: ప్రత్యేక అవసరాల కల్గిన చిన్నారుల తల్లిదండ్రులు భవిత కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం శావల్యాపురంలో భవిత సెంటరును సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ భవిత కేంద్రాల సేవలతో పిల్లల ఆరోగ్యం మెరుగుదలతో పాటు మానసిక వికాసం పెంపొందుతుందన్నారు. మానసిక వైకల్యం, వినికిడి లోపం చలన వైకల్యం వంటి ప్రత్యేక అవసరాల కల్గిన చిన్నారులు భవిత సెంటరును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈశిబిరంలో ఫిజియోథెరపిస్ట్ స్వాతీ, ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్‌రెడ్డి, పార్వతీ పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి మహిళకు గాయాలు

చిలకలూరిపేటటౌన్: ప్యాసింజర్ ఆటో బోల్తా పడటంతో మహిళ గాయాలైన సంఘటన రూరల్ మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. లింగంగుంట్ల గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌బి నరసరావుపేటలో ఉన్న తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు శుక్రవారం లింగంగుంట్ల జంక్షన్ వద్ద ఆటో ఎక్కింది. కావూరు గ్రామం శివారులో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికుల్లో మహబూబ్‌బీకి మాత్రమే గాయాలయ్యాయి. బాధితురాలిని నరసరావుపేట ఆస్పత్రికి తరలించగా రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాయం ఊసేలేదు.. ఖరీఫ్ సాగేదెలా..

కూటమి ప్రభుత్వంపై అన్నదాతల ఆగ్రహం



కొప్పునూరులో సాగుకు సమాయత్తమవుతున్న రైతు

మాచర్ల రూరల్: ఖరీఫ్ వచ్చేసింది. అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. రైతుల వేసవి దుక్కులు దున్నుతున్నారు. విత్తనాల సేకరణ పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పెట్టుబడి సాయం మాటే వారిని బాధిస్తోంది. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాగు కంటే ముందే పెట్టుబడి సాయం అందించారు. కానీ కూటమి ప్రభుత్వం హామీలు గుప్పించి ఇంత వరకు ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో రైతన్నా ఆందోళన చెందుతున్నారు.

గిట్టుబాటు ధర లేక..

గత ఏడాది సాగు అంత ఆశాజనకంగా లేదు. మద్దతు ధర లేకపోవడంతో నష్టపాలయ్యారు. భూమినే నమ్ముకున్న రైతన్న వాటితో సంబంధం లేకుండా మళ్లీ సాగుకు సన్నద్ధమయ్యాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదికి రూ.20 వేలు సాయం ఇస్తామని, గిట్టుబాటు ధర, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామంటూ ఇచ్చిన హామీలతో రైతులు మోసపోయారు. ఏడాది తిరిగే లోపే ఆ సాయం ఏపాటిదో అర్థం అయిపోయింది. పెట్టుబడి సాయందక, పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారు. మెట్ట ప్రాంతంలోని రైతులు పత్తి, మిరప, వేరుశనగ, కంది సాగుకు సిద్ధమవుతున్నారు. గత ప్రభుత్వం ప్రతి ఏటా రూ.13500 రైతుల ఖాతాలలో జమచేసి వారికి భరోసా కల్పించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క రూపాయి కూడా అందక అన్నదాతలు అల్లాడుతున్నారు.

ఉసూరుమనిస్తున్న బ్యాంకులు

పంట కోసం అప్పుగా తీసుకున్న రుణాలు చెల్లిస్తేనే మళ్లీ కొత్త రుణాలు ఇస్తామంటూ రైతులను బ్యాంకర్లు ఇబ్బంది పెడుతున్నారు. బంగారం తాకట్టు పెట్టి పంట రుణాలు తీసుకున్న రైతులు వడ్డీలు చెల్లిస్తేనే కొత్త రుణం ఇస్తామని చెప్పటంతో రైతులు గత్యంతరం లేని పరిస్థితిలో అధిక వడ్డీలకు తీసుకొచ్చి బ్యాంకులో అప్పులు చెల్లించి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. జూన్ మూడో వారం ముగుస్తున్నా ఇంత వరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇస్తామన్న సాయం అందలేదు.

సాయం ఎప్పుడిస్తారో తెలియదు



గత ప్రభుత్వంలో వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందే రైతు భరోసా ద్వారా నగదు చేతికొచ్చేంది. ప్రస్తుతం జూన్ మూడవ వారం దాటుతున్నా రైతులకు ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం గురించి ఎవరూ చెప్పటం లేదు. ఎవరిని అడిగినా అప్పుడు ఇప్పుడు అంటూ దాటవేసే సమాధానాలు తప్పితే స్పష్టత లేదు.

–బొడ్డు నరసింహారావు, రైతు, మాచర్ల

హామీలను అమలు చేయాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. నమ్మి ఓట్లు వేసిన రైతులను ఇబ్బందులకు గురిచేసే విధంగా ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవటం మంచిదికాదు. రైతుల పెట్టుబడులు దృష్టిలో పెట్టుకొని ఇస్తామన్న రూ.20వేలు వెంటనే అందజేయాలి. ఎప్పుడెప్పుడు ఎంత ఇస్తారో స్పష్టం చేయాలి.

– రంగా నాయక్, రైతు, అచ్చమ్మకుంట

ఆర్‌బీకేల ద్వారా ఎరువులు అందించాలి



గ్రామాలలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులను అందించాలని గత ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రతి ఏడాది రూ.13500 అకౌంట్లలో జమ చేసేది. నేడు పనులు ప్రారంభమైనా ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. వర్షాల వలన పంటలు దెబ్బతిన్నా ఒక్క రూపాయి కూడా సాయం అందించలేదు.

– గోగుల లక్ష్మారెడ్డి, రైతు, రాయవరం

నిత్యశ్రీకి ఘన సత్కారం



నిత్యశ్రీని సత్కరిస్తున్న న్యాయవాదులు, మదర్‌థెరిస్సా సేవాసమితి సభ్యులు

మాచర్ల: ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకుడు సి.హెచ్.నాగిరెడ్డి మనుమరాలు నిత్యశ్రీ నీట్‌లో ఆల్ ఇండియా 4,500 ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ ర్యాంకు 401 సాధించి ప్రతిభ చాటింది. శుక్రవారం పట్టణ న్యాయవాది సిహెచ్.నాగిరెడ్డి కార్యాలయంలో మదర్‌థెరిస్సా సేవాసమితి సభ్యులు నిత్యశ్రీ, ఆమె తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. మాచర్ల మండలంలోని రాయవరం గ్రామానికి సంబంధించిన చిలమకూరి శ్రీనివాసరెడ్డి, పద్మావతి దంపతుల కుమార్తె నిత్యశ్రీ, నీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు గాదే కిరీటిరెడ్డి, అందుగుల చంద్రయ్య, భాస్కర్ రెడ్డి, చిన్నపరెడ్డి శాంతి రెడ్డి, జిల్లాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి, పార్వతి, న్యాయవాది అందుగుల జోజి, కాలేజీ ప్రిన్సిపాల్ కుర్రి సాయిమార్, కొండారెడ్డి, న్యాయవాది అడ్వకేట్ గట్ల సత్యనారాయణ రెడ్డి, గుంజా ప్రసాద్ పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి



యోగాసనాలు వేస్తున్న అభ్యాసకులు



ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు



మున్సిపల్ కార్యాలయంలో శిక్షకుడు గోవిందరెడ్డిని సన్మానిస్తున్న కమిషనర్ వేణుబాబు

మాచర్ల/మాచర్ల రూరల్: ప్రజలకు యోగాపై అవగాహన కల్పించి నెల రోజుల పాటు శిక్షణనిచ్చిన రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యోగా ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని గోవిందరెడ్డిని సన్మానించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్‌కేబీఆర్ కళాశాల ఆవరణలో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. యోగా కార్యక్రమానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, ఇతర శాఖల అధికారులు పాల్గొంటారని చెప్పారు. అనంతరం నెల రోజుల పాటు శిక్షణనిస్తున్న యోగా గురువు మెట్టు గోవిందరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హేమలత పాల్గొన్నారు.

యోగాతో రుగ్మతలు దూరం

విజయపురిసౌత్: నిత్య జీవితంలో యోగా చేయటం ద్వారా అనేక రుగ్మతల దూరం చేయవచ్చని మాచర్ల వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ధ్యానం చేయటం అలవాటు చేసుకుంటే ఏకాగ్రతతో అనుకున్నది సాధిస్తారన్నారు. ఆధునిక సమాజంలో మనిషి ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని కూడా జయించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నయింబాను పాల్గొన్నారు.

న్యాయవాది కెనడి మృతి బాధాకరం



కెనడి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సివిల్ జడ్జిలు శ్రీనివాస కళ్యాణ్, ప్రశాంత్

మాచర్ల రూరల్: అభ్యుదయ భావాలు కలిగిన సీనియర్ న్యాయవాది కె.కెనడి మృతి చెందటం ఎంతో బాధాకరమని, స్థానిక సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాసకళ్యాణ్, అదనపు సివిల్ జడ్జి పి.ప్రశాంత్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణానికి చెందిన కుంటి కెనడి గుండెపోటుతో మృతి చెందగా ఆయన మృతదేహాన్ని సందర్శించారు. సందర్శించిన వారిలో ఏజీపీ గొర్రె వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ బాబు, న్యాయవాదులు కుర్రి సాయి మార్కొండా రెడ్డి, సిహెచ్.నాగిరెడ్డి, కర్పూరపు రంగారావు, కేశం శ్రీనివాసరావు, గుంజా వరప్రసాద్, షేక్ గాలిబ్ సాహెబ్, కృష్ణమూర్తి, గంగుల శ్రీనివాసరావు, బత్తుల బాబురావు, గంద్రకోట శ్రీనివాసరావు ఉన్నారు. తొలుత కోర్టు ప్రాంగణంలో సంతాపం తెలిపారు. అనంతరం కెనడి మృతదేహాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఈయన వెంట మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, నాయకులు యాగంటి మల్లికార్జున రావు, కజ్జం సైదయ్య, పోలూరి నరసింహారావు తదితరులున్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి, బీసీ సంఘ నాయకులు జింకల నాగేశ్వరరావు యాదవ్, ప్రేమరాజు, మాచర్ల సుందరరావు, అల్లి జీవన్, అబ్రహం లింకన్ నివాళులర్పించారు.

నాటుసారా తయారీ, విక్రయాలు మానుకోండి

ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి



తాడువాయి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ రవికుమార్‌రెడ్డి

అచ్చంపేట: గ్రామాలలో, తండాలలో బట్టీలు పెట్టి నాటుసారా తయారు చేయడం, విక్రయించడం మానుకోవాలని, అలా మానుకున్న వారందరినీ ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని, రుణాలిచ్చి ప్రత్యామ్నాయ పనులు చేసుకునేందుకు ప్రోత్సహిస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రవికుమార్‌డ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సూర్యనారాయణ సూచించారు. ఆల్టర్నేటివ్ లైవ్లీహుడ్ ప్రోగ్రామ్ కింద మండలంలోని సంద్రతండా, బంగారుతండా, తాడువాయి గ్రామాలలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. పాత ముద్దాయిలను పిలిపించి అవగాహన కల్పించారు. జీవనాధారం కోసం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామని కిరణా, ఫ్యాన్సీ లాంటి వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. నాటుసారా వలన కలిగే అనర్థాలను వివరించారు. అనుమానిత ప్రాంతాలలో నిరంతర నిఘా ఉంటుందన్నారు. అనంతరం క్రోసూరు, అచ్చంపేట మండలాల్లోని వైన్ షాపులను తనిఖీ చేశారు. టైమింగ్స్, ఎమ్మార్పీ బోర్డ్స్, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మద్యం విక్రయం లాంటి వాటిని పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు క్యాన్సిల్ చేసి, క్రిమినల్ కేసులు బనాయిస్తామని హెచ్చరించారు. వారి వెంట క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.తులసి, ఎస్ఐ శ్రీనివాస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న అనంతలక్ష్మి, ఏడుకొండలు, బుల్లిబాబు, తదితరులు

సత్తెనపల్లి: మానవ మనుగడకు ప్రాణవాయువైన ఆక్సిజన్ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి అన్నారు. సత్తెనపల్లి మండలం వావిలాలనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌లో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృభూమి పరిరక్షణకై ఒక మొక్క నాటుదాం అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ ఒక్కో మనిషి కనీసం 50 మొక్కలు నాటినా భూ మండలంపై ఎక్కడ చూసినా పచ్చని చెట్లు కళకళలాడతాయన్నారు. ప్రధానోపాధ్యాయుడు కుంభ ఏడుకొండలు మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు మన తల్లి ఏ విధంగా పెంచిందో అదే విధంగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ మనిషి జీవితంలో మొక్కలు అనేక విధాలుగా ఉపయోగపడతున్నాయన్నారు. మొక్కలు మానవ మనుగడలో భాగమన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు అక్షయ్, అంగన్‌వాడీ కార్యకర్తలు దమయంతి, యోగేశ్వరి, ఆయాలు, చిన్నారులు, పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

అమరావతి: మండల పరిధిలోని ఉంగుటూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అమరావతి కో లొకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్ హాజరై ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ గురించి ఎంపీపీ ఎల్ఈ, ఎంపీయూపీ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరిధర్ మాట్లాడుతూ ఫ్లోరోసిస్ ఏ విధంగా వ్యాపిస్తుందో, దానిని ఎలా నివారించాలో తెలియజేశారు. ముఖ్యంగా బోర్ వెల్ నీరు, పొగాకు సంబంధిత వస్తువులు, పానీపూరి, కుర్ కురే వంటి వాటిని తినడం.. ప్రధానంగా అందులో కలిపే బ్లాక్ సాల్ట్ వల్ల ఈ వ్యాధి సక్రమించే అవకాశం ఉందన్నారు. అలాగే బ్లాక్ టీ వంటివి మితిమీరి ఉపయోగిస్తే ప్రజలు త్వరగా ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడతారన్నారు. ఈ సందర్భంగా 3, 4, 5 తరగతుల పిల్లలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే కమ్యూనిటీ సర్వే కూడా గ్రామంలో నిర్వహించాలని సూచించారు. ఈ వ్యాధి నివారణకు రక్షిత తాగునీరు, కాల్షియం, విటమిన్ సీ, ఈ పోషకాలు అధికంగా ఉన్న కూరలు, పండ్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఒ.లక్ష్మీమనోహర్, సీహెచ్‌వో సంధ్యా రాణి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలి

విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్



రాజుపాలెం: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని మాచర్ల డివిజన్ విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మండలంలోని కొండమోడు విద్యుత్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం చేయకుండా విద్యుత్‌ను అందించాలని తెలిపారు. విద్యుత్ బిల్లుల వసూళ్లలో అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై గృహ వినియోగదారులకు అవగాహన కల్పించి, ఈ నెల 25వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. విద్యుత్ శాఖ సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని, వినియోగదారులకు అందుబాటులో ఉండాలని అన్నారు. 24 గంటలు విద్యుత్ సరఫరా అయ్యే విధంగా సిబ్బంది చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూతలపాటి సింగయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.నాగసురేష్‌బాబు, రాజుపాలెం ఏఈ కోట పెదమస్తాన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నరసరావుపేటటౌన్: గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూటౌన్ ఎస్ఐ లేఖ ప్రియాంక శుక్రవారం తెలిపారు. క్రిష్టియన్ పాలెంకు చెందిన మందపాటి సురేష్(38)కు అతని భార్యకు మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రావటంలేదని మనస్తాపం చెందిన సురేష్ ఈ నెల 17వ తేదీన ఇంట్లో గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలి

ఆర్డీఓ మురళీకృష్ణ



రెవెన్యూ దినోత్సవంలో మాట్లాడుతున్న ఆర్డీఓ



మాచర్ల తహసీల్దార్ కిరణ్ కుమార్‌ను సన్మానిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలు

గురజాల: రెవెన్యూ కార్యాలయాల్లో ప్రజల సమస్యలపై వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చూడాలని రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సత్వరమే సమస్య పరిష్కరించే విధంగా చూడాలన్నారు.

ప్రజలకు అందుబాటులో రెవెన్యూ సేవలు

పిడుగురాళ్ల: ప్రజలకు రెవెన్యూ సేవలు పూర్తిస్థాయిలో అందించేందుకు కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ మధుబాబు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. మధుబాబు మాట్లాడుతూపిడుగురాళ్ల కార్యాలయంలో స్పెషల్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అర్జీలు రాయలేని వారికోసం, సమస్యలు ఎక్కడ ఎలా పరిష్కారం అవుతాయి అనే అంశాలను ప్రజలకు తెలిపేందుకు ప్రత్యేకించి ఈ డెస్క్ వద్ద ఇద్దరు రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలి

మాచర్ల రూరల్: అన్నీ శాఖలను సమన్వయం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం విస్తృతమైన సేవలందించే రెవెన్యూ శాఖలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించటం అదృష్టమని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కత్తి మీద సాము వంటి రెవెన్యూ వృత్తిలో రాణించటం గొప్ప విషయమని చెప్పారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం రెవెన్యూ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన రిటైర్డ్ ఉద్యోగులు కొరటా నారాయణ, సూరిబాబు, లక్ష్మీనారాయణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ బత్తుల వాణి, ఆర్ఐ ఇంటూరి అనిల్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రంగారావు, సర్వేయర్ సాల్మన్‌రాజ్, వీఆర్ఓలు ఆరుముళ్ళ నాగేశ్వరరావు, ప్రశాంతి, రవి కుమార్ పాల్గొన్నారు.

తల్ సైనిక్ క్యాంప్‌నకు పది మంది క్యాడెట్స్



ఎంపికైన విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారులు

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి తల్ సైనిక్ క్యాంప్ పోటీలకు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 10 మంది క్యాడెట్స్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. జూలై 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అనంతపూర్‌లో నిర్వహించే రెండు తెలుగు రాష్ట్రాల ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్‌లో 10 మంది క్యాడెట్స్ పాల్గొంటారని తెలిపారు. జిల్లా, బెటాలియన్, గ్రూప్ స్థాయిలో జరిగిన ఎంపిక శిబిరాల్లో కఠినమైన శారీరక, మానసిక పరీక్షలను విజయవంతంగా అధిగమించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను 23వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్ఎస్ పర్మర్, కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, అభినందించారు.

ఇరువురు యువకులకు విద్యుదాఘాతం

బొల్లాపల్లి: విద్యుత్ లైనుల మరమ్మతులు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతంతో ఇరువురు యువకులు కిందపడి గాయపడ్డారు. ఘటన మండంలోని గుట్లాపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌పరిధిలో ఘాటి తండా వద్ద శుక్రవారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం ఘాటి తండాకు చెందిన ఒడితే పుంసానాయక్, భుక్యా అఖిల్ నాయక్ విద్యుత్ శాఖ అధికారులు నూతన లైనులు ఏర్పాటు చేస్తున్న సమయంలో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను వైద్యులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

సొలస క్లస్టర్ సీసీకి తీవ్ర గాయాలు

యడ్లపాడు: మండలానికి చెందిన వెలుగు సొలస క్లస్టర్ కమిటీ సభ్యుడు గొల్లమూడి నాగేశ్వరరావు గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. సుమారు 9 గంటల సమయంలో మండలంలోని సంతపేట వద్ద నాగేశ్వరరావు ప్రయాణిస్తున్న బైక్‌ను మరో వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆయన కాలు విరిగినట్లు తెలుస్తోంది. వెంటనే స్పందించిన స్థానికులు ఆయనను నరసరావుపేటలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం అక్కడ ఆయనకు చికిత్స అందిస్తున్నారు.